





పోస్టల్ బ్యాలెట్‌కు పోటెత్తిన ఓటరు

తొలిరోజు పోలింగ్ 74.34 శాతం


కలెక్టరేట్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ షన్మోహన్

పోలింగ్ శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
పుంగనూరు	1,974	1508	79.39
నగరి	1,150	955	83.04
జీడీనెల్లూరు	1,681	1337	79.53
చిత్తూరు	2,778	1832	65.09
పూతలపట్టు	1720	1298	75.46
పలమనేరు	1,925	1373	71.32
కుప్పం	908	720	79.29
మొత్తం	12,136	9023	74.34

● జిల్లాలో సగటున 74.34 శాతం మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా నగరిలో 83.04 శాతం.. అత్యల్పంగా చిత్తూరులో 65.09 శాతం వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం జిల్లా ఎన్నికల అధికారి 8వరకు గడువు పొడిగించారు.


పీవీకేఎన్ కళాశాలలో ఓటేసిన మహిళా ఉద్యోగులు

- అత్యధికంగా నగరిలో 83.04, అత్యల్పంగా చిత్తూరులో 65.09 శాతం
- అరగంట ఆలస్యంగా ప్రారంభమైన ఓటింగ్
- పీవీకేఎన్ కేంద్రంలో పేర్లు లేవంటూ ఉద్యోగుల ఆందోళన
- అధికారులు కల్పించుకుని మళ్లీ ఓటు అవకాశం
- అన్ని కేంద్రాల్లో పోటెత్తిన ఉద్యోగులు

చిత్తూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదివారం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేందుకు పోటెత్తారు. తొలిరోజు 74.34 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ అరగంట ఆలస్యంగా ప్రారంభం కావడం, ఎన్నికల సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడం వల్ల ఓటు వేసే సమయం రెండు నుంచి నాలుగు గంటలు పట్టింది. అయినా విసుగుచెందని ఉద్యోగ, ఉపాధ్యాయులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మరో మూడు రోజులు గడువున్నా తొలిరోజే ఎక్కువ మంది ఓటు వేశారు.

● బారులుతీరిన ఓటర్లు

జిల్లాల పునర్విభజన తర్వాత ఒక జిల్లాలో ఉద్యోగం చేస్తూ మరో జిల్లాలో ఓటున్న ఉద్యోగ ఉపాధ్యాయులు వందల కిలోమీటర్ల దూరాన్ని లెక్క చేయకుండా వ్యయ ప్రయాసాల కోర్చి మండుటెండల్లో ఓటు హక్కు వినియోగం కోసం చిత్తూరు కలెక్టరేట్‌లో బారులు తీరారు. తగినన్ని కౌంటర్ల ఏర్పాటు చేయకపోయినా, పోస్టల్ బ్యాలెట్ వరుస సంఖ్య చెప్పే సిబ్బంది లేకపోయినా సంయమనంతో వివరాలు నమోదు చేశారు.

● వెయిటింగ్ హాలులో రెండు గంటలకు పైగా పడిగాపులు

పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు వేసేందుకు పలు ప్రొఫార్మాలలో వివరాల నమోదు..వాటికి గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరణ.. అసెంబ్లీ, పార్లమెంటు బ్యాలెట్ పేపర్లను వేర్వేరు కవర్లలో పెట్టి అతికించాల్సి రావడం.. తదితర ప్రక్రియలతో ఓటింగ్ ఆలస్యమవుతుంది. దీన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. పోలింగ్ కేంద్రం వద్దకు క్యూలో ప్రవేశించేందుకు ముందు వెయిటింగ్ హాలులో రెండు గంటలకు పైగా పడిగాపులు కాశారు. ఆ తర్వాత చాంతాడంత క్యూలో కనీసం రెండు గంటలు నిరీక్షిస్తే గానీ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సరైన అనుభవం లేని సిబ్బంది, ధ్రువీకరణ చేయాల్సిన గెజిటెడ్ అధికారులు ఒకరిద్దరే ఉండడం.. ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ప్రతి కేంద్రంలో రెండే ఏర్పాటు చేయడం తదితర కారణాలతో ఓటింగ్ ప్రక్రియ ప్రహసనంలా కొనసాగింది.

● ఓటర్లకు తీవ్ర అసౌకర్యం

భోజన విరామ సమయం వరకు క్యూలైన్లలో నిరీక్షించిన వారిని అధికారులు భోజనం చేసుకుని రమ్మని చెప్పడంతో పలువురు వెళ్లిపోయారు. భోజనం తర్వాత మళ్లీ తొలి నుంచీ క్యూలైన్‌లో నిలవాల్సి రావడంతో అసహనానికి గురయ్యారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లలో దాదాపు సగం మంది మహిళలు ఉన్నప్పటికీ వారికి ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో క్యూలైన్లో నిలిచేందుకు, తోపులాటను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డారు.


కుప్పంలోని ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ కంచర్ల పర్యవేక్షణ

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి 8వ తేదీ వరకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, మే 5: నిర్ణీత గడువులోగా ఫారం 12 ఇవ్వని జిల్లా, జిల్లాయేతర ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 12,500 మంది ఉద్యోగులను వినియోగిస్తుండగా 11వేల మంది ఫారం-12 దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. మిగిలిన వారికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీ నిర్ణయించిందని, సోమవారం నుంచి మూడు రోజులపాటు సమీప నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో వీరికి సోమవారం వరకు మాత్రమే గడువు ఇచ్చినట్లు తెలిపారు.

నేడు, రేపు హోమ్ ఓటింగ్

చిత్తూరు కలెక్టరేట్, మే 5 : జిల్లాలో సోమ, మంగళవారాల్లో హోమ్ ఓటింగ్ నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు 23,511 మంది, 85ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లు 6,488 మంది ఉన్నారు. వీరిలో చాలామంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోలేదు. చేసుకున్న 636 మందిలో 70 దరఖాస్తులను జిల్లా అధికారులను వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగిలిన 566 మంది హోమ్ ఓటింగ్ ప్రక్రియను వారి ఇళ్ల వద్దకే వెళ్లి చేపట్టనున్నారు. హోమ్ ఓటింగ్ విధానంలో వీరు తమ ఓటును బ్యాలెట్ బాక్సుల్లో వేయాల్సి ఉంది. గెజిటెడ్ ఆఫీసర్, అసిస్టెంట్ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఇంటికి వస్తారు. ఈ బృందం వచ్చినప్పుడు వీరు అందుబాటులో లేకుంటే మరుసటి రోజు వస్తారు. అప్పుడూ లేకపోతే 13వ తేదీన నేరుగా వెళ్లి ఓటు వేయవచ్చు.


పూతలపట్టులో బిడ్డతో కలిసి ఓటు వేసేందుకు వచ్చిన మహిళా ఉద్యోగి

● స్పష్టత కరువు

ముందుగా పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకోనప్పటికీ అటువంటి సిబ్బంది తగిన ఆధారాలతో ఓటు వేయొచ్చని జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించిన విషయం తెలిసిందే. పోలింగ్ కేంద్రాల వద్ద ఆ విషయంలో స్పష్టతనిచ్చేందుకు 11 వరకు సిబ్బంది కరువయ్యారు. అటువంటి ఓటర్ల ఆందోళనను అక్కడున్న వివిధ సంఘాల ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో తర్వాత వారిని కూడా అనుమతిచ్చారు.

● దూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో..

చిత్తూరు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇతర జిల్లా ఓటర్ల పోలింగ్ కేంద్రం కిక్కిరిసింది. ఇక్కడికి పుత్తూరు, నగరి, తిరుపతి, పీలేరు, పుంగనూరు, మదనపల్లె తదితర ప్రాంతాల నుంచి చాలా మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు వచ్చారు. బృందాలుగా మారి వాహనాలను ఏర్పాటు చేసుకుని ఓటింగ్‌కు తరలివచ్చారు.

● చిత్తూరు కలెక్టరేట్‌లోని ఇతర జిల్లా ఓటర్ల పోలింగ్ కేంద్రంలో ఉదయం 11 గంటలకు వెళ్లినవారు మధ్యాహ్నం 2 గంటలకు ఓటేసి బయటికి వచ్చారు. అంటే ఇక్కడ ఒక్కో ఓటరుకు 4 గంటల సమయం పట్టింది. పీవీకేఎన్ పోలింగ్ కేంద్రంలో ఉదయాన్నే కొందరు ఉద్యోగులు జాబితాలో తమ పేర్లు లేవని ఆందోళన చెందారు. అధికారులు వారి ధ్రువపత్రాలు తీసుకుని ఓటు సదుపాయం కల్పించారు. కేంద్రాల్లో క్యూలో నిలబడిన ఉపాధ్యాయుల పట్ల సెక్యూరిటీ సిబ్బంది (పోలీసులు) దురుసుగా ప్రవర్తించారు. పరుషంగా మాట్లాడారు. దీంతో వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● నగరి నియోజకవర్గంలోని పుత్తూరు, వడమాలపేట మండలాలకు చెందిన ఓటర్లకు తిరుపతి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలుత పుత్తూరు కేంద్రమని చెప్పి, ఓ రోజు ముందే తిరుపతి కేంద్రమని చెప్పడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

● ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రయత్నించడం కనిపించింది. అధికార పార్టీ నాయకులు వారి కనుసన్నల్లో మెలిగే కొన్ని సంఘాల ప్రతినిధులు బహిరంగంగానే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు.

● పలమనేరు కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ నాయకులు ప్రచారం చేసుకుంటూ ఉండగా.. రెండు గ్రూపుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు సర్దుబాటు చేసి పంపించేశారు.

● పూతలపట్టు పోలింగ్ కేంద్రంలో ఐదు మండలాల ఓటర్లకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. బంగారుపాళ్యం కేంద్రం వద్ద అదే మండలానికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్ రెడ్డి ఓటర్లను సైగలు చేసి ప్రభావితం చేస్తున్నారని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ఆయన్ను ఆ స్థానం నుంచి మార్చేవరకు మురళి పట్టుబట్టారు.

● బంగారుపాళ్యం మండలంలో కొందరు వైసీపీ నాయకులు శనివారం రాత్రి పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగుల ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరించినట్లు తెలిసింది. డబ్బు తీసుకుని వైసీపీకి ఓటేయ్యాలని, మళ్లీ ఇక్కడే ఉద్యోగం చేయాలనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.


పుంగనూరనులో ఓటు వేసి బయటకు వస్తున్న దివ్యాంగుడైన ఉద్యోగి

ఎండ..వడగాడ్పులు

ఉక్కిరిబిక్కిరవుతున్న జనం

ఆరెంజ్ జోన్‌లోకి ఐదు మండలాలు


ఎండకు బోసిపోయిన దర్గా సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, మే 5: ఒకవైపు ఎండ..మరో వైపు వడగాడ్పులతో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఆదివారం గంగవరం, పెద్దపంజాణి, పుంగనూరు, సోమల, తవణంపల్లె మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లాయి. వి.కోటలో 43.6, నగరి, శ్రీరంగరాజపురం 43.0, వెదురుకుప్పం 42.6, సోమల 42.1, పెద్దపంజాణి 41.7, పూతలపట్టు 41.4, పుంగనూరు 41.3, నింద్ర 41.2, పెనుమూరు 41.0, పలమనేరు, రొంపిచెర్ల, విజయపురం 40.8, శాంతిపురం 40.7, గంగవరం, కార్వేటినగరం 40.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

11 మండలాల్లో వర్షం

గడిచిన 24 గంటల్లో జిల్లాలోని 11 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గంగాధరనెల్లూరులో 26.0, వెదురుకుప్పం 24.6, ఐరాల 16.2, చిత్తూరు 13.2, పెనుమూరు 10.0, యాదమరి 4.8, పలమనేరు 4.4, గంగవరం 4.2, పూతలపట్టు 4.0, గుడిపాల 3.4, శ్రీరంగరాజుపురంలో 2.4 మిమీ వర్షపాతం నమోదైంది.

ప్రశాంతంగా నీట్


పీఈఎస్ పబ్లిక్ స్కూల్ వద్ద అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), మే 5: చిత్తూరులో ఆదివారం నేషనల్ ఎలిజిబులిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ప్రశాంతంగా నిర్వహించినట్లు నీట్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణబాబు తెలిపారు. బీవీరెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్, పీఈఎస్ పబ్లిక్ స్కూల్, బృందావన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 814 మంది విద్యార్థులకు గాను 772 మంది హాజరుకాగా, 42 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, రిజిస్ట్రేషన్, ఫొటో, స్కానింగ్, బయోమెట్రిక్ అనంతరం అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించారు. కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.


మద్యం, నిందితులతో సీఐ ఉలసయ్య

రూ.4.30 లక్షల కర్ణాటక మద్యం సీజ్

● నలుగురి అరెస్టు... ఇద్దరు పరార్

చిత్తూరు, మే 5: అక్రమంగా తరలిస్తున్న రూ.4.30 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేయగా ఇద్దరు పారిపోయారు. శంకరయ్యగుంటలోని ఓ షాపు వద్ద మారుతి వ్యాను నుంచి కర్ణాటక మద్యాన్ని దించుతుండగా రహస్య సమాచారం మేరకు ఎస్‌ఐలు ఇక్బాల్, ప్రసాద్ సిబ్బందితో కలిసి సాయికృష్ణారెడ్డి, ఆనంద్, నవీన్‌కుమార్, భానుప్రకాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 815 టెట్రా ప్యాకెట్లతోపాటు ఓమిని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కారు, మద్యం విలువ రూ.4.30లక్షలు ఉంటుందని సీఐ ఉలసయ్య తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న పకోడా కుమార్, ఆలీని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

మిగిలింది ఆరు రోజులే..!

ప్రచారానికి కౌంట్‌డౌన్

చిత్తూరు కలెక్టరేట్, మే 5: ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో తలమునకలై ఉన్నారు. వీధివీధి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. వాహనాల ద్వారా నెల రోజులుగా వీధుల్లో ప్రచారం హోరెత్తిస్తున్నారు. దీనికి కౌంట్‌డౌన్ మొదలైంది. బహిరంగ ప్రచారం, సభలకు కేవలం ఆరు రోజులు మాత్రమే ఉంది. ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందు ప్రచారాన్ని ముగించాలి. 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రచారం నిలిపేయాల్సి ఉంటుంది.

రఘుపతినాయుడు మృతిపై కేసు నమోదు

చౌడేపల్లె, మే 5 : బోయకొండకు చెందిన రఘుపతినాయుడు మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మే ఒకటో తేదీ రాత్రి బోయకొండ సమీపంలో రఘుపతినాయుడిపై టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, హరిబాబు, సురేంద్ర దాడి చేయటంతో గాయపడినట్లు ఆయన అక్క ఆదిలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఆయన తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందటంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడితే హత్యగా మారుస్తున్నారు..

ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడితే పోలీసులు హత్యగా మారుస్తున్నారని టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బోయకొండ సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో రఘుపతినాయుడుకు తీవ్ర గాయాలయ్యాయని, తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. అయితే పోలీసులు వైసీపీకి తొత్తులుగా మారి ఆ ఘటనకు ఏ మాత్రమూ సంబంధం లేని టీడీపీ కార్యకర్తలపై 302 సెక్షన్ కింద కేసు పెట్టడమేమిటని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి ఓటమి భయంతోనే ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు కేసులపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ముగిసిన ఏపీఆర్‌సెట్

86 శాతం హాజరు, 15న ఫలితాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 5: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి చేపట్టిన ఏపీఆర్‌సెట్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 2 నుంచీ 5వ తేదీ దాకా ఈ పరీక్షలు నిర్వహించారు. 10,050 మంది దరఖాస్తు చేయగా, ఇందులో 8651 మంది హాజరయ్యారు. హైదరాబాదుతో పాటు రాష్ట్రంలోని 17 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్టు ఏపీఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు వెల్లడించారు. 86.5శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఈ నెల 15వ తేదీన ఫలితాలు విడుదల చేస్తామన్నారు. జూన్‌లో అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు హేమ, కుసుమ హరినాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ


ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, మే5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఉదయం అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారిని ప్రీతికరమైన వేపాకు తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో చంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు

తిరుమల, మే5(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.95 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.2.95 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 77,848 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 39,317 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


వెంకట్ కామత్, డైరెక్టర్ల బృందం


గోపాలస్వామి - పీఎంఎస్ ప్రసాద్

తిరుమల, మే 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. డీఆర్‌డీవో చైర్మన్ వెంకట్ కామత్, పలు విభాగాల డైరెక్టర్ల బృందం, ఎన్నికల మాజీ చీఫ్ కమిషన్ గోపాలస్వామి, రిలయన్స్ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

'బాత్రూం ఫొటోలు తీశారా? అరెరే.. టైం అయిపోతోంది.. అటెండెన్స్ ఇంకా అప్లోడ్ చేయలేదా? అదిగో, రాగి జావకు టైం అయిపోయినట్లుంది రోజు రాగిజావ కదా.. గ్లాసులు శుభ్రంగా ఉన్నాయా? భోజనం రెడీ అయిపోయినట్లుంది.. ఎగ్స్ సరిగా లెక్కపెట్టి ఇచ్చారా? చిక్కీలకు జగన్ ఉన్న స్టిక్కర్లు తీసి రెడీ చేశారా? మరచేపోయాను.. స్కూల్‌కు ఆబ్సెంట్ అయిన విద్యార్థుల పేరెంట్స్‌కు ఫోన్ చేసి వాళ్లు ఎందుకు రాలేదో కనుక్కుని నోట్ చేశారా?' స్కూల్‌కు వెళ్తూనే ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా వెళ్లినప్పటినుంచి హెడ్మాస్టర్‌నుంచి టీచర్లకు ఎదురయ్యే ప్రశ్నలివి. ఈ మధ్యలో బోధన హుష్ కాకి అవుతోంది. టెన్త్‌లో అత్యధిక పర్సంటేజీ ప్రభుత్వానికి చూపించడానికి పరీక్షల్లో లిబరల్‌గా వదలడం అధికారులకు అనివార్యంగా మారుతోంది.

- కుప్పం



బాత్‌రూం నుంచి విద్యార్థుల పాదాలు పట్టడం దాకా!

బోధనకు దూరం.. యాప్‌ల భారం ● పాఠశాలల్లో టీచర్లకు నిత్యం నరకం

ఒకప్పుడు గురువుల పాదాలకు విద్యార్థులు నమస్కారం పెట్టి, దీవెనెలు కోరేవారు. ఇప్పుడు గురువులే విద్యార్థుల పాదాలు పట్టి కొలతలు తీస్తున్నారు. ఒకప్పుడు బతకలేక బడిపంతులు అనేవారు. ఇప్పుడు కాలం తిరగబడింది. యాప్‌లతో వేగలేని టీచర్లు.. బతకలేకనే బడిపంతుళ్లమయ్యామని వాపోతున్నారు. యాప్‌లమీద యాప్‌లు, డేటా అప్లోడ్‌లు, అందుకోసం వారు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్ల వరకు ఇదే పరిస్థితి. యాప్‌ల మధ్య అక్షరాలా బోధన 'చిక్కి'పోతోంది. 'ఏముంది, యాప్‌లే కదా. డేటా అప్లోడ్ చేయడానికి ఎంతసేపు పడుతుంది?' అని కూడా అనిపిస్తుంది. కానీ ఒక్కో యాప్‌లో వారు పొందుపరచాల్సిన అంశాల జాబితా చూసుకుంటే 'ఓఎంజీ' అన్న కేక మన నోట్లోంచి బయటకు వచ్చేస్తుంది.

● ఇవిగో యాప్‌లు.. బయోమెట్రిక్ ఫేషియల్

ఈ యాప్‌లో టీచర్లు ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేయాలి. ఇది పనిచేసే సరికి కనీసం పది నిమిషాలైనా పడుతుంది. ఒక్కోసారి మన మొబైల్ పనిచేయదు. పక్క టీచర్ వేశాక, వారి మొబైల్ తీసుకుని అటెండెన్సు వేయాలంటే మరో పది నిమిషాలు పడుతుంది.

ఐఎంఎంఎస్

ఉదయం స్కూల్‌కు వెళ్లగానే బాత్రూం ఫొటోలు తీసి ఈ యాప్‌లో అప్లోడ్ చేయాలి. అవి పరిశుభ్రంగా లేకపోతే పైనుంచి మందలింపులు. పాఠశాలలకు పనివాళ్లంటూ ఎవరూ ఉండరు. హెడ్మాస్టర్ జేబుల్లోంచి కూలీ డబ్బులిచ్చి ఎవరినైనా పెట్టుకోవాలి. ఆపైన ప్రభుత్వం ఎప్పుడు, ఎంత నగదు మంజూరు చేస్తే అప్పుడు తీసుకుని సరిపెట్టుకోవాలి. ఈ బాత్రూంల ఫొటోలు ఉదయం 10.30 గంటల్లోగా అప్లోడ్ కాకుంటే ఆ స్కూల్ పేరు యాప్‌లో వచ్చేస్తుంది. దానికి సంజాయిషీలు ఇచ్చుకోవడం అదో తంటా. దీనికి సుమారు అరగంట సమయం గాలిలో కలిసిపోతుంది.

స్కూల్ అటెండెన్స్ యాప్ : తరగతి గదికి వెళ్లగానే ముందుగా మ్యాన్యువల్‌గా రిజిస్టర్‌లో పిల్లల అటెండెన్స్ తీసుకోవాలి. మళ్లీ ఆ అటెండెన్స్‌ను యాప్‌లో అప్లోడ్‌చేయాలి. ఎవరైనా ఆబ్సెంట్ అయితే అప్పటికప్పుడే వారి తల్లిదండ్రులకు ఫోను చేసి కారణం తెలుసుకుని.. దానిని యాప్‌లో పొందుపరచాలి. మధ్యాహ్నం భోజనంలో గుడ్లు తినే వాళ్లు ఎందరు? చిక్కీలు ఎంతమందికి ఇవ్వాలి.. వంటి వివరాలూ తీసుకుని అప్పటికప్పుడు యాప్‌లో అప్లోడ్ చేయాలి. దీనికి మరో 20 నిమిషాలు గడిచిపోతుంది.

జగనన్న గోరుముద్ద

పిల్లలు భోజనాలు చేసే ప్లేట్లు, రాగి జావ తాగే గ్లాసులు, వంట వండడానికి లేదా వడ్డించడానికి వాడే పాత్రల జాబితా ఈ యాప్‌లో అప్లోడ్ చేయాలి. మధ్యాహ్న భోజనంకోసం వండిన లేదా ఏదైనా ఏజన్సీ నుంచి అందిన ఆహార పదార్థాలు ప్రతి దానినీ ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలి. దీనికి మరో 20-30 నిమిషాలు హుష్‌కాకి.

..అంటే పేరుకు నాలుగు యాప్‌లే కానీ, వాటిలో పొందుపరచాల్సిన అంశాల జాబితా చాంతాడంత ఉంటుంది. ఇదంతా ముగిసేసరికి ఉదయం బోధనా సమయంలో సుమారు రెండు గంటలపాటు సమయం హారతి కర్పూరం అవుతుంది.

విద్యా సంవత్సరంలో టీచర్లు అనేక అంశాలు అప్లోడ్ చేయాల్సిన, లేదా స్వయంగా శిక్షణ తీసుకోవాల్సిన యాప్‌లు ఇంకా బోలెడు ఉన్నాయి. వీటిలో రెండింటి గురించి చూద్దాం.

ఏపీ స్టేట్ పోర్టల్ మార్క్స్ ఆన్‌లైన్

ఈ యాప్‌లో పరీక్ష మార్కులు అప్లోడ్ చేయాలి. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4, ఎఫ్ఏ-2 అనే పేర్లతో ఏడాదిలో ఆరుసార్లు అన్ని తరగతులకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పేపర్లు దిద్ది ఒట్టి మార్కులు మాత్రమే వేస్తే సరిపోదు. ఏవేవో మార్కులు కలపాలి. మళ్లీ తీసివేయాలి. ఆ కలిపి, తీసివేసిన మార్కుల సగటును లెక్కలు కట్టాలి. అలా లెక్కలు కట్టగా వచ్చిన చివరి ఫలితాలను మాత్రమే యాప్‌లో అప్లోడ్ చేయాలి. చాలాసార్లు ఈ యాప్ సక్రమంగా పనిచేయదు. అందుకని అర్ధరాత్రిళ్లు ఇళ్లల్లోనూ కూర్చుని మధ్యమధ్యలో వచ్చే అంతరాయాలు అధిగమించి తెల్లవారుజాము దాకా అలా అప్లోడ్ చేస్తూనే ఉండాలి. ఒక్కోసారి ఒక క్లాసులో సగంమంది విద్యార్థుల డేటా భర్తీ చేసిన తర్వాత యాప్ ఎర్రర్ చూపిస్తుంది. అప్పుడు వీరు పడిన కష్టమంతా వృథా అయి, మళ్లీ మొదటినుంచీ చేయాల్సిందే.

జగనన్న విద్యా కానుక

ఈ యాప్‌లో యూనిఫామ్, స్కూల్ బ్యాగ్‌లు, షూస్, నోట్‌బుక్స్, అచ్చు పుస్తకాలు.. ఇలా విద్యా సంవత్సరం మొదట్లో పాఠశాలకు వచ్చిన అన్నిరకాల వస్తువుల లెక్కలు కట్టి, విద్యార్థులవారీగా అప్లోడ్ చేయాలి. ఈ 'కానుక'లు ఒకేసారి వస్తే ఫరవాలేదు. విద్యా సంవత్సరం సగం దాకా కనీసం మూడునాలుగు సార్లు విడతలువిడతలుగా వస్తూనే ఉంటాయి. అలా వచ్చినప్పుడల్లా క్లాస్ టీచర్లు గోడౌన్లకు వెళ్లి వాటిని తమ పాఠశాలకు మోసుకు రావాలి. ఇలాంటి చర్యలతో విద్యా సంవత్సరం ప్రథమార్థాన్ని బోధనకు అందకుండా స్వాహా చేసేస్తున్నాయి. మళ్లీ విద్యార్థుల యూనిఫామ్, షూస్‌కోసం కొలతలు కూడా టీచర్లే తీసుకోవాల్సి రావడం గమనార్హం.

కనిపించని బోధన

సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో తెలియక.. ఎప్పటికప్పుడు వివరాలు అప్లోడ్ చేయడానికి తరగతి గదుల్లో టీచర్లు మొబైల్ పట్టుకునే కనిపిస్తారు. క్లర్కులు లేకపోవడంతో తరగతుల పనితోపాటు పాఠశాల రికార్డుల అప్లోడ్ బాధ్యతా హెచ్‌ఎంతోపాటు టీచర్లే తీసుకోవాలి. మళ్లీ ఇన్‌స్పెక్షన్లు, తనిఖీలు అంటూ హడావుడి. నోట్సులు కరెక్షన్ చేశారా? పాఠ్యాంశాలు పూర్తి చేశారా? అంటూ ఆరాలు. పని షెడ్యూళ్లు, తాఖీదులు. బోధనకు సమయమే చిక్కనప్పుడు.. ఇవన్నీ ఎలా నిర్వహించగలమన్నది ప్రభుత్వానికి టీచర్ల ప్రశ్న.

విజయపురం... ఉరిమింది


సమావేశంలో గాలి భానుప్రకాష్‌తో రోజా వ్యతిరేకవర్గం నాయకులు

- ఏకమైన రోజా వ్యతిరేక శక్తులు
- భానుప్రకాష్‌కు మద్దతు
- చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్న నేతలు

పుత్తూరు అర్బన్, మే 5: విజయపురం కన్నెర్ర చేసింది.... ఐదేళ్లగా గూడుకట్టుకుని ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. అధికారాన్ని ఆలంభనగా చేసుకుని ఐదేళ్లగా కళ్లెదుటే జరిగిన అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలపై రగిలిపోయింది. మంత్రి రోజా, ఆమె కుటుంబసభ్యుల నుంచి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు అండగా నిలవాలని ప్రతినబూనింది. రోజాను ఓడించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఇందుకుగాను త్వరలోనే అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటామని రోజా వ్యతిరేకవర్గం స్పష్టం చేసింది. ఆదివారం విజయపురం కేంద్రంగా జరిగిన ఆత్మీయ సమావేశంలో వైసీపీ అభ్యర్థి రోజాపై ఉరుములు, మెరుపులతో కూడిన వాగ్బాణాలను సంధించింది. ఎన్నికల రణరంగంలో రోజాకు అపజయాన్ని రుచిచూపేందుకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరింది.

ఏకమైన అన్ని శక్తులు

స్వపక్షం, విపక్షం తేడా లేకుండా నియోజకవర్గంలోని అన్ని శక్తులు ఏకమయ్యాయి. నాలుగు దశాబ్దాల పైబడి కాంగ్రెస్ రాజకీయాల్లో కీలక నాయకులుగా వ్యవహరించి, ఆ తరువాత వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్న నాయకులు మంత్రి రోజాకు వ్యతిరేకంగా టీడీపీ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే పుత్తూరుకు చెందిన డీఎన్ ఏలుమలై మొదలియార్ పసుపు కండువా కప్పుకోగా, ఆదివారం నింద్రకు చెందిన శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురంకు చెందిన లక్ష్మీపతిరాజు అదే బాట పట్టనున్నట్లు విజయపురం మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో తమ అనుచరులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రకటించారు. వీరితో పాటు స్థానిక టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరై రోజా వ్యతిరేకవర్గం రాకను ఆహ్వానించడం వైసీపీని డిఫెన్స్‌లో పడేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీ వర్గాల్లో గుబులు

2014, 2019 ఎన్నికల్లో నగరి ఎమ్మెల్యేగా రోజా గెలుపునకు వెన్నుదన్నుగా నిలిచిన నాయకులు ఈ దఫా ఆమె ఓటమికి కృషి చేస్తామని చెప్పడం వైసీపీ వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. ఆమె కుటుంబ అవినీతి, అక్రమాలు, అవమానాలు భరించలేకే పార్టీ వీడాల్సి వచ్చిన విషయాన్ని సమావేశంలో తేటతెల్లం చేశారు. నగరి నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు సమర్థుడైన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు వెల్లడించారు.

జోష్ మీదున్న టీడీపీ

ఇప్పటి వరకు డిఫెన్స్ గేమ్ ఆడిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక వ్యూహాన్ని మార్చుకున్నారు. వైసీపీపై ఎటాకింగ్ పాలిటిక్స్‌కు దిగారు. గత రెండు ఎన్నికల్లో రోజా గెలుపునకు కీలకంగా మారిన నాయకులే టార్గెట్‌గా రాజకీయ వ్యూహాలు పన్నారు. నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలనే సదుద్దేశంతో చేతులు కలపాలని వైరి వర్గ నేతలతో సంప్రదింపులు జరిపి తనవైపునకు తిప్పుకోగలిగారు.ఈవ్యూహం ఫలించడంతో వైసీపీకి నగరిలో పునాదులు కంపిస్తున్నాయి. అన్ని అనుకూలంగా మారుతుండడంతో టీడీపీ శ్రేణులు ఫుల్ జోష్ మీదున్నాయనే చర్చ జరుగుతోంది.

చంద్రబాబుతోనే సమర్థవంతమైన పాలన


మారేడుపల్లెలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

తవణంపల్లె, మే 5: రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడికే సాధ్యమని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని మారేడుపల్లె, ఎగువవమారేడుపల్లె, సంతపల్లె, ద్వారకాపురం తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌ను, ఎంపీ అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే జిల్లాకు పరిశ్రమలు తెప్పించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుని మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సునీల్‌కుమార్, నాయకులు సుధాకర్‌నాయుడు, వినాయక, గోపియాదవ్‌లతోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దగ్గుమళ్లను గెలిపించండి : నారా గిరీష్


మద్దిపట్లపల్లెలో నారా గిరీష్‌కు హారతి ఇస్తున్న మహిళలు

ఐరాల, మే 5: చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని, అలాగే చంద్రబాబు సీఎం అయితే రాబోవు తరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని నారా గిరీష్ అన్నారు. ఆదివారం ఆయన కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకుని మద్దిపట్లపల్లెలోని ఎంఎన్.చౌదరి ఇంటికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌కు అఖండ విజయం అందించాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం ఇరవై ఏళ్ల వెనుకబడిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ సూపర్ సిక్స్ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గంగారపు హరిబాబునాయుడు, మధుసూదన్‌రావు, హేమాద్రి నాయుడు, యువ నాయకుడు ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో క్షురకుడి ఆత్మహత్య


యల్లప్ప మృతదేహం

చౌడేపల్లె, మే 5 : అప్పుల బాధతో క్షురకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పుదిపట్ల పంచాయతీ మిట్టూరుకు చెందిన గురుస్వామి కుమారుడు యల్లప్ప(45) పుదిపట్లలో బార్బర్ షాపు నిర్వహిస్తూ జీనవం సాగిస్తున్నాడు. షాపు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.15లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేకపోవడం, రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి తన షాపు వద్దనే ఉరేసుకున్నాడు. ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రదోష నంది సేవ



శ్రీకాళహస్తి, మే 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ప్రదోష నంది సేవ ఘనంగా జరిగింది. త్రయోదశి తిథిని పురస్కరించుకుని సాయంత్రం ఆలయంలో స్వామివారికి విశేష ఉత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద ప్రదోష నందిపై స్వామివారి మూర్తిని కొలువుదీర్చారు. ధూప, దీప, నైవేద్య హారతులను సమర్పించారు. అనంతరం ఆలయంలోపల ప్రదోష నంది సేవలో ప్రాకారోత్సవంగా నిర్వహించారు. తిరిగి ఆలయంలో కొలువుదీర్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు వద్ద టాటా సుమోలో మంటలు



ఏర్పేడు, మే 5: ఏర్పేడు మండలం పల్లం పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఓ టాటా సుమోలో నుంచి ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. దీంతో పెట్రోల్ బంకు సిబ్బందితో పాటు పల్లం, గొల్లపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఒడిశాకు చెందిన కొంతమంది భక్తులు రెండు సుమోల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం బయలుదేరి వచ్చారు. పల్లం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఒక టాటా సుమో మరమ్మతులకు గురైంది. దీంతో ఆ వాహనాన్ని అక్కడే వదిలేసి మరో వాహనంలో తిరుమలకు వెళ్లారు. ఆదివారం ఉన్నట్లుండి టాటా సుమోలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ముక్కంటి ఆలయ ఉద్యోగి

శ్రీకాళహస్తి, మే 5: వైసీపీ ఎన్నికల ప్రచారంలో గణపతిరాజు అనే ముక్కంటి ఆలయం ఒప్పంద ఉద్యోగి పాల్గొనడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయలోని రూ.500 రాహు-కేతు సర్ప దోష పూజ మండపంలో గణపతిరాజు ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుంటారు. ఆయన వైసీపీ నేతలతో అత్యంత సన్నిహితంగా మెలుగుతుంటారన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. శనివారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి పట్టణంలోని కైలాసగిరి కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో పాల్గొన్న గణపతిరాజు ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్‌డీఏ కూటమి నేతలు ఎన్నికల అధికారులకు, ముక్కంటి ఆలయ ఈవో నాగేశ్వరరావుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేశారు. దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విధుల నుంచి తప్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

జన కేతనం



అధ్వానంగా ఉన్న సదుం-కలికిరి రోడ్డు

జగన్ నడిచిన దారి

ఇది సదుం- కలికిరి రోడ్డు. 2018లో ప్రతిపక్ష నేతగా జగన్ ఈ రోడ్డు మీదుగానే పాదయాత్ర చేశారు. సీఎం అయ్యాక రోడ్లపై తట్టడు మట్టి పోయడాన్నే మరిచిపోయారు. కనీసం తాను నడిచిన దారినైనా బాగు చేయాలన్న ఆలోచన లేకుండా పోయింది. నాడు పాదయాత్రలో భాగంగా పుంగనూరు నియోజకవర్గంలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మండలమైన సదుంలో జగన్ పాదయాత్ర చేశారు. పీలేరు నియోజకవర్గం కలికిరి నుంచి పాలమంద మీదుగా సదుంకు జగన్ పాదయాత్రగా వచ్చిన రోడ్డు ఇప్పటికీ సింగల్‌రోడ్డుగానే ఉంది. అనేక ప్రాంతాల్లో గోతులమయంగా దుస్థితిలో ఉంది. చింతమాకులపల్లె, పాలమంద, రెడ్డివారిపల్లెల్లో రోడ్డు అధ్వాన్నంగా ఉండటమే కాక చెరువుకట్టపై రోడ్డు ప్రమాదకరంగా ఉంది. కలికిరిలో సైనిక్‌స్కూల్, జేఎన్‌టీయూ, వివిధ ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలున్నాయి. అలాగే కలికిరి-సదుం దూరం 17 కిలోమీటర్లు ఉండటంతో ఇరుమండలాల ప్రజలకు అనేక అవసరాలు ఉంటాయి. కానీ పెద్దిరెడ్డి మంత్రి అయినా కూడా ఈరోడ్డును పట్టించుకోకపోవడంపై విమర్శలున్నాయి.

- పుంగనూరు



బాగుండావాక్కా!

● ఇదీ సందు

'బాగుండావాక్కా.. బాగుండావా సెల్లీ, అన్నో బాగుండావా.. ఎక్కడుండేది మనం?' అంటూ క్షేమసమాచారాలు కనుక్కునే ఫోన్లు ఎక్కువైపోయాయప్పా ఇబ్బుడు. ఎందబ్బో ఇంత ప్రేమ అనుకుంటున్నారా? ఏమీ లేదు. ఎలచ్చన్లు వొచ్చేసినాయి గదా. అన్ని పార్టీల జాతకాలు బాగుండాలంటే ఇన్నేళ్లూ మరిచిపోయిన జనాలను గుర్తు పెట్టుకున్నట్లు నటించాల. అందుకే ఇదంతా రాజకీయ జీవుల పాట్లు. పార్టీలు ఇప్పటికే వార్డులవారీగా ఇన్‌ఛార్జిలను పెట్టేసి ఉండాయి. మున్సిపాలిటీ అయితే కౌన్సిలర్లు, పంచాయతీలు అయితే సర్పంచిలు, వార్డు మెంబర్లు, వీళ్లావాళ్లూ కాకపోతే యూనిట్ ఇన్‌ఛార్జిలు. వీరికి ఓటరును పలకరించే బాధ్యతను అప్పగించేసినాయి. 'మీరేం జేస్తారో మాకు తెలీదప్పా. రేపు మీ బూత్‌లో ఓట్లు తగ్గితే పార్టీలో పుట్టగతులుండవు. ఇప్పుడే చెప్తావుండాం. అనాక మమ్మల్ని అంటే లాబంలేదు' అని గెట్టిగా వార్నింగ్ ఇచ్చేసినాయి. పల్లెల్లో అయితే ఎక్కడున్నోళ్లు అక్కడే ఉంటారు. కానీ టౌన్లల్లో అద్దెకుండే వాళ్లే ఎక్కువ. వాటిల్లో అరాకొరా వేతనాలతో బతికే బడుగు జీవులూ ఎక్కువే. ఈరోజు ఉండే ఈదిలో రేపు కనిపించని మనుషులు శానా మందే ఉంటారు. అందుకని పార్టీలు నియమించిన ఇన్‌ఛార్జిలు పొద్దన్నే ఓటర్ల జాబితా లిస్టు ముందేసుకోని ఫోన్లు కొడతా వుండారు. 'నువ్వు ఫలానా కదా. మీరు ఇప్పుడు ఎక్కడుండారు? ఇంట్లో అంతా బాగానే ఉండారు గదా. మన పార్టీకే ఓటెయ్యాల మరిసిపోబాక. మళ్లీ ఇంటికొచ్చి కలస్తాంలేప్పా' అంటా అడ్రెస్‌లు, బాగోగులు కనుక్కునేదానికి మల్లుకున్నారు. రేపు 'పంపిణీలు' చేయాలన్నా ఓటర్ల అడ్రెసు తెలిసి ఉండాల గదా. అందుకన్నమాట. జనాలైతే అలా వొస్తావుండే ఫోన్ పలకరింపులకు మురిసిపోవడం లేదుకానీ, రేపు 'పంపిణీల'కోసం నన్ను గూడా గుర్తు పెట్టుకుండారు సాలు.' అని తృప్తి పడిపోతా వుండారు.


- కుప్పం

'వాహన మిత్ర' అన్నారు. మూడింట ఒకటో వంతు మందికే ఏడాదికి రూ.10 వేలు ఇచ్చారు. వీరికి తెలియకుండానే.. వేర్వేరు మార్గాల్లో పది రెట్లు లాగేసుకున్నారు. ఇచ్చింది కొందరికైతే.. లాక్కుంది మాత్రం అందరి నుంచీ. ఇలా ఒకచేత్తో ఇచ్చి.. మరో చేత్తో లాగేసుకుని కూడా.. తాను ఆటో, ట్యాక్సీ యజమానులను ఉద్ధరించానంటూ ప్రతి సభలోనూ చెప్పుకోవడం సీఎం జగన్‌కే చెల్లింది. ఈ సాయం వెనుక మతలబు తెలుసుకుంటే రెక్కాడితేకాని డొక్కాడని డ్రైవర్లకూ జగన్ పెట్టిన వాతలేంటో అర్థమవుతుంది.

- చిత్తూరు సిటీ



● వాహన శత్రు



● వాహన మిత్ర లబ్ధిదారులకు జగన్ కుచ్చుటోపి
● నిబంధనల పేరుతో లబ్ధిదారుల కోత
● నిత్యం అధిక జరిమానాలతో వేధింపులు

ఇచ్చింది | గుంజింది

50 వేలు 5.50 లక్షలు

డీజిల్ రూ.2.16 లక్షలు లాగేసి..



రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు పొరుగున ఉన్న కర్ణాటకతో పోలిస్తే కనీసం రూ.12 ఎక్కువ. ఒక రోజుకు సగటున ఒక ఆటో డ్రైవర్ 10 లీటర్ల డీజిల్ వినియోగిస్తారు. లీటరు మీద రూ.12 చొప్పున రోజుకు రూ.120, నెలకు రూ.3600.. ఏడాదికి రూ.43,200.. ఐదేళ్లకు రూ.2.16 లక్షలు నష్టం కలుగుతోంది. అంటే జగన్ ఈ ఐదేళ్లలో రూ.50 వేలు ఇచ్చి ఒక్క డీజల్ ద్వారానే రూ.2.16 లక్షలు లాగేసుకున్నారన్న మాట.

జరిమానా ఒక్కొక్కరిపై రూ.1.50 లక్షలు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు పత్రాలు సరిగా లేకపోయినా రవాణాశాఖ అధికారులు, పోలీసులు కాస్త ఉదారంగా ఉండి హెచ్చరించి నామమాత్రపు జరిమానా వేసేవారు. జగన్ ప్రభుత్వంలో అధికారులు డ్రైవర్లను బాగా ఇబ్బంది పెట్టారు. చిన్న పొరపాటుకు కూడా భారీ జరిమానా విధించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 2020లో రవాణా నిబంధనల ఉల్లంఘనకు జరిమానాలను పెంచింది. వీటిపై ఏ రాష్ట్రమూ ముందుకు వెళ్లకపోయినా జగన్ ప్రభుత్వం మాత్రం అమలుకు ఉత్తర్వులిచ్చింది. అనేక జరిమానాల రూపంలో సగటున ఒక్కో డ్రైవర్‌కు ఏడాదికి రూ.30 వేలు పడుతోంది. ఐదేళ్లలో రూ.1.50 లక్షలవుతోంది.



జరిమానా తేడాలు అప్పుడు.. ఇప్పుడు

● టీడీపీ హయాంలో సగటున జరిమానా రూ.130కి మించేది కాదు. ఖాకీ షర్టు లేకపోయినా, సిగ్నల్ జంపింగ్, పొరపాటున రాంగ్ పార్కింగ్ చేసినా, ఆటో డ్రైవర్ పక్కన కూర్చున్నా టీడీపీ ప్రభుత్వంలో రూ.130 జరిమానా విధించేది. ఇప్పుడు జగన్ ప్రభుత్వం రూ.1350 వసూలు చేస్తున్నారు. పర్మిట్ లేకుంటే ఏకంగా రూ.10 వేలు జరిమానా విధిస్తున్నారు.



ఆటోలు, ట్యాక్సీలకు బీమా, ఫిట్‌నెస్, రిపేర్ల కోసం రూ.10 వేలు ఇస్తానన్నది జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. జిల్లాలో ఆటో, ట్యాక్సీలు సుమారు 20 వేల వరకు ఉన్నాయి. కానీ సొంత వాహనం ఉన్న వారికే పథకం వర్తిస్తుందని నిబంధన పెట్టడంతో మూడింట ఒక వంతు వారికే పథకం దక్కింది. ఎందుకంటే.. వాహన యజమానుల కంటే ఆటోలను అద్దెకు తీసుకుని నడిపేవారి సంఖ్యే ఎక్కువ. కొందరు యజమానులకు నాలుగైదు ఆటోలు కూడా ఉంటాయి. సగటున నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగించినవారు, మునిసిపల్ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ నివాసేతర వాణిజ్య భవనం కలిగి ఉన్నా, జీఎస్టీ కడుతున్నా, 3 ఎకరాల కంటే ఎక్కువ తడి / 10 ఎకరాల మెట్ట భూమి కలిగినవారు, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, పింఛనుదారులున్నా ఈపథకానికి అనర్హులు. దీంతో వేలాదిమంది వాహన యజమానులు పథకానికి అర్హత కోల్పోయారు. జిల్లాలో 20 వేల వరకు ఆటోలు, ట్యాక్సీలు ఉండగా, ఇన్ని కోతలేసి 2019-20లో 5,879 మందిని అర్హులుగా చేర్చారు. 2020-2021లో 6,674, 2021-22లో 6,105, 2022-23 లో 6,044, 2023-24లో 6,482 మంది వాహన యజమానులకు మాత్రమే వాహనమిత్ర ద్వారా నగదు అందజేశారు. ఇలా ఈ కొందరికి ఐదేళ్లలో రూ.50 వేలను ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం.. అందరి వద్దా రూ.5.50 లక్షలు వంతున లాగేసింది.

మా నుంచి లాక్కుందే ఎక్కువ

'జగన్ పాదయాత్రలో ఆటో డ్రైవర్లందరికీ డబ్బు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు వాహన యజమానికి మాత్రమే ఇచ్చారు. ఏటా క్యాస్ట్ సర్టిఫికెట్ కావాలంటున్నారు. డ్రైవర్లకు డబ్బు ఇవ్వడానికి క్యాస్ట్ సర్టిఫికెట్‌తో ఏం పని? వాహనమిత్ర పథకానికి అప్లై చేయాలంటే ప్రతి ఏడాది ధ్రువపత్రాల కోసం చాలా కష్టపడాల్సి వస్తోంది. అలాగే ఏడాదికి రూ.10 వేలిచ్చి అనేక రకాలుగా మా వద్ద లక్షకు పైగా లాగేస్తున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకంటే పది రూపాయలకంటే ఇక్కడ ఎక్కువగా ఉంది.'

- ఇది ఓ డ్రైవరు ఆవేదన

సాయం కొందరికి.. నష్టం అందరికీ

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంతల రోడ్లే. ఆటోలను నడపలేకపోతున్నాం. తరచూ రిపేర్లు వస్తున్నాయి. వాహనమిత్ర పథకం అందరికీ రాలేదు. కొంతమంది ఓనర్లకే వచ్చింది. డ్రైవర్లకు ఎలాంటి ఉపయోగం లేదు. ఒక్కోసారి రోజంతా కష్టపడి ఆటోకు అద్దె చెల్లించి ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఈ పథకం వల్ల కొంతమందికే లాభం చేకూరింది. నష్టం మాత్రం అందరికీ కలుగుతోంది.

- మరో ఆటో డ్రైవర్ బాధ ఇది.

గుంతల రోడ్లతో రూ.1.80 లక్షల ఖర్చు

రహదారుల నిర్వహణకూ జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఈ ఐదేళ్ల రహదారులు ఛిద్రమైపోయాయి. రోడ్ల మీదున్న గుంతలు పూడ్చే పరిస్థితి కూడా లేదు. గుంతలమయమైన ఈ రోడ్లలో ఆటోలు నడుపుతుంటే టైర్లు దెబ్బతింటున్నాయి. 40 వేల కిలో మీటర్లు రావాల్సిన టైర్ల జీవితకాలం 30 వేల కిలోమీటర్లకే పడిపోతోంది. తరచూ పంచర్లవుతున్నాయి. ఇక, మూడేళ్లు రావాల్సిన బేరింగులు ఏడాదికే అరిగిపోతున్నాయి. గతంలో లీటరు డీజల్‌కు 30 కిలోమీటర్లు ఇచ్చే మైలేజీ.. అధ్వాన రహదారులతో ఇప్పుడు 25 కిలోమీటర్లకు పడిపోయింది. ఆటో నిర్వహణ ఖర్చు నెలకు సుమారు రూ.3 వేలు దాటుతోంది. ఇలా వాహనాల మరమ్మతులకు ఐదేళ్లలో రూ.1.80 లక్షలు ఖర్చవుతోంది. వాహనమిత్ర పథకం దేవుడెరుగు.. ముందు రోడ్లు బాగుచేస్తే బాగుండునని చాలామంది డ్రైవర్లు అంటున్నారు.



తాగునీటి పైపులైన్ల వద్ద నిలిచిన మురుగునీరు



దెబ్బతిన్న కాలువ, చెత్తాచెదారంతో ఆగిన మురుగుతో దుర్గంధం - కొళాయిలు అమర్చక పైపులతోనే తాగునీటి సరఫరా



● గుర్తుందా మేడం

ఇది మీ దత్తత గ్రామమే

మీరాసాహెబ్‌పాళెం.. నగరి మండల పరిధిలో వందకుపైగా ఇళ్లున్న గ్రామమిది. దీనిని మంత్రి రోజా దత్తత తీసుకున్నారు. ఇంకేముంది.. అద్భుతంగా మౌలిక వసతులు సమకూరి.. అభివృద్ధిలో జిల్లాలకే ఆదర్శంగా తమ గ్రామం నిలుస్తుందని గ్రామస్థులంతా భావించారు. సంతోషపడ్డారు. కానీ, మంత్రి దత్తత తీసుకున్నాక కేవలం రెండు సిమెంటు రోడ్లు వేశారు. వీధి దీపాలు ఏర్పాటు చేశారంతే. మిగతా వసతులు కల్పించలేదు. ముఖ్యంగా పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దెబ్బతిన్న కాలువకు తోడు.. చెత్తాచెదారం చేరి మురుగు కదలడంలేదు. దీంతో దుర్గంధం నెలకొంది. దోమల బెడద ఎక్కువైంది. గ్రామంలోకి వెళ్లే సిమెంటు రోడ్డు పక్కన మురుగునీరు చేరిపోయి ఉంది. ఇలా కనీస వసతుల్లేక వీరంతా సతమతమవుతున్నారు. మరోవైపు ఈ గ్రామంలోని 52 మందికి జగనన్న కాలనీలో పక్కాగృహాలను మంజూరు చేశారు. అందులో 51 ఇళ్లను కాంట్రాక్టర్లు.. ఒక ఇంటిని లబ్ధిదారే నిర్మించుకున్నారు. ప్రభుత్వం పక్కా గృహానికి మంజూరు చేసిన 1.80 లక్షలకు సిమెంటు రాళ్లతో గోడలు కట్టి మోల్డింగు వరకు వేసి వదిలేశారు. ఆ డబ్బు అంత వరకే వస్తుందని ఆపై పూతపని, ఇతర పనులను లబ్ధిదారులే చేసుకోవాలని కాంట్రాక్టర్లు చెప్పారట. దీంతో కొందరు అప్పు చేసి ఇళ్లను పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారు అలాగే వదిలేశారు. 15 మందికిపైగా ఆ కాలనీలో నివాసం ఉంటున్నారు. కనీసం రోడ్డుకూడా ఇప్పటికీ ప్రభుత్వం వేయలేదు. తాను దత్తత తీసుకున్న గ్రామంలోని వారికి ఇచ్చిన కాలనీలో మౌలిక వసతుల విషయంలోనూ మంత్రి రోజా చొరవ తీసుకోకపోవడం గమనార్హం. ఇక, తాగునీటి పైపులైన్లకు కొళాయిలు అమర్చలేదు. పైపులతో నీటిని పట్టుకుంటున్నారు. ఇక్కడి సమస్యలను ఎవరికైనా చెప్పాలన్నా స్థానికులు భయపడే పరిస్థితి. ఈ విషయం వాళ్లకు తెలిస్తే తమకు ఇబ్బంది అంటూ సమస్యలు చెప్పడానికీ వారంతా వెనకడుగు వేస్తున్నారు. అన్నా ఏమీ అనుకోవద్దు అంటూ వెళ్లిపోతున్నారు.

- నగరి

15 ఏళ్ల కిందట ఆవిర్భావం

● గంగాధరనెల్లూరు చరిత్ర

మూడు నియోజకవర్గాల్లోని ఆరు మండలాల కలయికతో 15 ఏళ్ల కిందట గంగాధరనెల్లూరు (ఎస్సీ రిజర్వు) నియోజకవర్గం ఏర్పాటైంది. ఒకప్పుడు గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పెనుమూరు, గుడిపాల., చిత్తూరు మండలంలోని కొన్ని పంచాయతీలు కలిపి వేపంజేరి నియోజకవర్గంగా ఉండేది. నియోజకవర్గాల

సంవత్సరం	ఎమ్మెల్యేలు	పార్టీ
2009	గుమ్మడి కుతూహలమ్మ	కాంగ్రెస్
2014	కె.నారాయణస్వామి	వైసీపీ
2019	కె.నారాయణస్వామి	వైసీపీ

పునర్విభజనలో భాగంగా వేపంజేరి రద్దయింది. అందులోని మండలాలను కొత్తగా ఏర్పాటైన గంగాధరనెల్లూరు, పూతలపట్టులో కలిపారు. అలా.. వేపంజేరి నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు.. పుత్తూరు నియోజకవర్గంలోని వెదురుకుప్పం, పాలసముద్రం, శ్రీరంగరాజపురం.. నగరి నియోజకవర్గంలోని కార్వేటినగరం మండలాలతో గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఏర్పాటైంది.

ఎన్నికలు జరిగింది: మూడుసార్లు. కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇప్పటి వరకు తెలుగుదేశం ప్రాతినిథ్యం లేదిక్కడ.

విశేషాలు

● మొదటి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ నుంచి గెలుపొందిన కుతూహలమ్మ, రెండో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు.

● రెండుసార్లు గెలిచి.. డిప్యూటీ సీఎంగా ఉన్న నారాయణస్వామి మూడోసారి పోటీలో లేరు. ఆయన కుమార్తె బరిలో ఉన్నారు

● మూడు ఎన్నికల్లోనూ టీడీపీ తరఫున అభ్యర్థులను మారుస్తూ వచ్చారు. ఈసారి ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్న టీడీపీ.. డాక్టర్ థామస్‌ను అభ్యర్థిగా నిలిపింది.


మొత్తం ఓటర్లు: 2,04,669

పురుషులు: 1,01,697

మహిళలు: 1,02,966

ఇతరులు: ఆరుగురు

- వెదురుకుప్పం/జీడీనెల్లూరు



పలమనేరు
కుప్పం/పుంగనూరు

చంద్రబాబును ఎంచుకుని.. ఓటును సద్వినియోగం చేసుకోండి


కుప్పంలో ప్రచారం చేస్తున్న గాజుల ఖాదర్‌బాషా

కుప్పం, మే 5: ఈనెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి చంద్రబాబును ఎంచుకుని ఓటును సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా కోరారు. కుప్పం పురపాలక సంఘంలోని నబీపేటలో ఆదివారం స్థానిక యూనిట్ ఇన్‌ఛార్జి ముత్తు, బూత్ ఇన్‌ఛార్జి అప్పు ముఖేశ్‌లతో కలిసి ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్ కూడా గల్లంతు కానున్న భరత్‌కు ఓటేస్తే అది నిష్ఫలమవుతుందని హెచ్చరించారు. రానున్నది చంద్రన్న స్వర్ణయుగమమన్నారు. వైసీపీకి, ఆ పార్టీ నాయకులకు ఈ ఎన్నికలే చివరి ఎన్నికలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయమ్మ, రియాజ్, వాసు, ఇమ్రాన్, సల్మాన్, ముత్తు, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లను కుప్పంలో నిలపాలని వినతి


రైల్వే జీఎం అరవింద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జగదీశ్‌బాబు

కుప్పం, మే 5: మైసూరు-రామేశ్వరంతోపాటు నిజాముద్దీన్, ఎర్నాకులం, హరియా రైళ్లను కుప్పంలో నిలుపుదల చేయాలని కోరుతూ సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షులు జగదీశ్‌బాబు ఆదివారం దక్షిణ పశ్చిమ రైల్వే జనరల్ మేనేజరు అరవింద్ శ్రీవత్సకు విన్నవించారు. బెంగళూరు యలహంక వీల్ అండ్ ఎక్సెల్ కార్యాలయంలో జగదీశ్ జీఎంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నుంచి పుష్‌పుల్ రైలును ఉదయం 9 గంటలకు నడపాలని కోరారు. కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర సందర్భంగా కుప్పంమీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లకు ఇక్కడ రెండు నిముషాలసేపు స్టాపింగ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జీఎం అరవింద్ శ్రీవత్స తన వినతికి సానుకూలంగా స్పందించినట్లు జగదీశ్ తెలిపారు. జీఎంను కలిసినవారిలో ఏకేపీ.వేలన్, ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి


రాజుపేటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, మే 5 : ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వత్ర నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, తెలుగు రైతు నియోజకవర్గం అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ కోరారు. ఆదివారం రాజుపేట, వీర్నమల, మనీంద్రం, పంచాయతీలలో ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామమూర్తి, శివ్వనాథ్, వెంకటాచలపతి, నందరెడ్డి, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బతుకులు బాగుపడాలంటే టీడీపీని ఆదరించాలి


గోవిందరాజుపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, మే 5: వైసీపీ అసమర్థ పాలనలో అస్తవ్యస్తమైన బతుకులు బాగుపడాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ సర్పంచ్ పెరుమాళ్ కోరారు. ఆదివారం బందార్లపల్లె పంచాయతీ గోవిందరాజుపురంలో వారు ఇంటింటా ప్రచారం చేశారు. కుప్పం అభివృద్ధి ప్రదాత చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే సింగసముద్రం పంచాయతీ కుప్పిగానిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేత వేలు తన కుటుంబ సభ్యులతో పాటు పలువురు మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యం సమక్షంలో సైకిల్ ఎక్కారు. ఈ కార్యక్రమంలో నాయ కులు నందారెడ్డి, సుబ్బీ, శ్రీనాథరెడ్డి, మునిరెడ్డి, మురళి, మంజునాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణప్ప, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కలెక్టర్, ఎస్పీ


కలెక్టర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), మే 5: స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతం

కుప్పంలో 79.29 శాతం ● పుంగనూరులో 72.29 శాతం


కుప్పం ఫెసిలిటేషన్ కేంద్రం ఎదుట రోడ్డుపై ఉద్యోగులు, రాజకీయ శ్రేణుల కోలాహలం


పుంగనూరులో ఓట్లు వేయడానికి క్యూలో నిలుచున్న ఉద్యోగులు


కుప్పంలో తనిఖీ చేసి లోపలికి పంపుతున్న పోలీసులు

కుప్పం, మే 5: కుప్పంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం ప్రశాంతంగా సాగింది. కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఫెసిలిటేషన్ సెంటర్‌గా నిర్ణయించారు. ఇక్కడ జరిగిన పోలింగ్‌లో నియోజకవర్గంలోని మొత్తం 908 మంది ఉద్యోగులకుగాను 720 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.శ్రీనివాసులు తెలిపారు. తొలిరోజున 79.29 పోలింగ్ శాతం నమోదైనట్లు పేర్కొన్నారు. కాగా పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా పోలీసులు ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉద్యోగులు ఉదయం 9.30 గంటల నుంచే రావడం ప్రారంభించారు. మూడు కౌంటర్‌లు ఏర్పాటు చేసినా క్యూలలో ఉద్యోగులు గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. పోలింగ్ ప్రక్రియ సుదీర్ఘం కావడంతో చాలామంది ఫెసిలిటేషన్ కేంద్రం లోపలికి ప్రవేశించిన తర్వాత ఓటు వినియోగించుకోవడానికి కనీసం మూడునాలుగు గంటలు నిరీక్షించాల్సి వచ్చింది. అయినాసరే ఓపికగా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. కాగా ఎన్నికల విధులను కేటాయించిన ఉద్యోగులే పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. వారి ఫోన్లను ఫెసిలిటేషన్ కేంద్రంలోకి అధికారులు అనుమతించ లేదు. బయటే మొబైల్స్‌ను వదిలి లోపలికి వెళ్లి ఓటు వేసి వచ్చారు. రాజకీయ నాయకులు సైతం కేంద్రం బయటే వేచివుండి ఉద్యోగులను ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ తరపున ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, వైసీపీ తరపున ఎమ్మెల్సీ భరత్ తదితరులు ఆయా పార్టీల నేతలతో పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఆదివారం పోస్టల్ బ్యాలెట్‌లో పాల్గొనలేని ఉద్యోగులు సోమవారం ఇదే కేంద్రంలో వారి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు.

పుంగనూరు: పుంగనూరులో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ కౌంటర్లలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉదయం 9గంటలకే ఉద్యోగులు అధిక సంఖ్యలో బారులు తీరారు. పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదన్‌రెడ్డి పలు మార్లు పోలింగ్ సరళి, విధానాన్ని పరిశీలించి ఓటర్లకు తాగునీరు, నీడ ఏర్పాటు చేశారు. పుంగనూరు నియోజకవర్గ పరిధిలో 2086 మంది ఓటర్లు ఉండగా 1508మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా, దివ్యాంగులైన ఉద్యోగ ఓటర్లు ఎండ తీవ్రతను లెక్కచేయకుండా ఓటింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాలను రాజంపేట ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్‌కన్నా పరిశీలించి ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి, ఎస్‌ఐలు సుబ్బారెడ్డి, మహ్మద్ రఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కానీ పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఓటర్లను మద్దతు ఇవ్వాలని కోరారు. కొంతమంది ఓటు హక్కు వినియోగించడానికి వాహనాలు సైతం సమకూర్చారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటుకు రూ.3వేలు

పుంగనూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు ఓటుకు రూ.3వేలు నజరానా ఇచ్చినట్లు తెలిసింది. ఓటర్ల వివరాలు తెలుసుకుని శనివారం నుంచే పుంగనూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో డబ్బులు పంపిణీ చేసినట్లు సమాచారం.

ఇప్పుడేమి ఎన్నికలు?

సార్వత్రిక ఎన్నికలు ఈనెల 13వ తేదీ జరగనున్న విషయం తెలిసిందే. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బాక్సు ఏర్పాటు చేయగా తొలిసారి సాధారణ రీతిలో పోలింగ్ నిర్వహించారు. దీంతో సాధారణ జనం 'ఇప్పుడేమి పోలింగ్ మాకు ఓట్ల చీటీలు ఇవ్వలేదే' అని సందేహం వ్యక్తం చేశారు.

రజకుల సమస్యలు పరిష్కరిస్తాం: అమర్


వి.కోటలో ప్రచారం చేస్తున్న ప్రసేన్‌రెడ్డి, కీలపల్లె వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమర్

పలమనేరు, మే5 : పలమనేరు నియోజకవర్గంలో రజకుల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పలమనేరు సమీపంలోని దోబీఘాట్ వద్ద ఆ సంఘం నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. తొలినుంచి తెలుగుదేశం పార్టీ రజకుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నాయకులు ఆర్వీ.బాలాజీ, పట్టణ ప్రధానకార్యదర్శి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి గ్రామంలో టీడీపీ మహిళా నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేగా అమరనాథరెడ్డిని, ఎంపీగా ప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్రిష్ణవేణి, పార్టీ మండల అధ్యక్షుడు కిషోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కీలపల్లె పంచాయతీ బాలేపల్లె, గంగవరం పంచాయతీలోని మారేడుపల్లె గ్రామాలలో అమరనాథరెడ్డి ప్రచారం నిర్వహించారు. అనంతరం కీలపల్లెలో వైసీపీకి చెందిన పురుషోత్తం రెడ్డి, ధర్మరాజు యాదవ్, క్రిష్ణమూర్తి యాదవ్, బి.రవికుమార్, పొన్నమాకులపల్లెకు చెందిన కేశవగౌడు, రమేష్‌గౌడు, అక్కులప్పగౌడు, బాలేపల్లెకు చెందిన లోకేష్‌రెడ్డి, మంజునాధరెడ్డి, బాలకృష్ణారెడ్డి పార్టీలో చేరారు.

వి.కోట: వి.కోట పట్టణ పరిధిలోని వార్డులో అమరనాథరెడ్డి తరపున ఆయన తనయుడు ప్రసేన్‌రెడ్డి ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు శబరీష్, జనార్ధన్‌రెడ్డి, నారాయణ స్వామి, మురుగేస్, ఆరీఫుల్లా, అమానుల్లా, శివకుమార్, ముకుంద, రాము, నారాయణరాజు, మునిరత్నం తదితరులు ఉన్నారు. ● మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో ప్రచారాలు ముమ్మరం చేయాలని ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు టీడీపీ శ్రేణులకు సూచించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని లింగాపురంలో టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు ఉద్రిక్తత


టీడీపీ నాయకులను నిలువరిస్తున్న పోలీసులు

పలమనేరు, మే5 : పలమనేరులోని పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పలమనేరు-గుడియాత్తం రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు ఓటు వేసేందుకు వస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులను తమ పార్టీకే ఓట్లు వేయాలని అభ్యర్థనలు చేస్తూ వచ్చారు. పోలీసులు పలుమార్లు వీరిని హెచ్చరించినా వారు ఓటర్లను అభ్యర్థిస్తూ వచ్చారు. సుమారు 11 గంటల ప్రాంతంలో ఓట్ల అభ్యర్థనపై ఇరువర్గాల నడుమ వాగ్వాదం జరిగింది. ఘర్షణపూరిత వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాలను అడ్డుకుని దూరంగా పంపించి వేశారు. కాగా పోలింగ్ కేంద్రం ప్రధాన ద్వారం వద్దనే ఓటర్ల గుర్తింపు కార్డులు పోలీసులు తనిఖీ చేసి లోనికి అనుమతించారు. లోనికి వెళ్లిన ఓటర్ల వద్ద నుంచి పోలింగ్ సిబ్బంది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి, వైసీపీ అభ్యర్థి వెంకటేగౌడ, ఆర్వో మనోజ్‌రెడ్డి సందర్శించారు. పోలింగ్ కేంద్ర సమీపంలోని వైసీపీ శిబిరం వద్దకు చేరుకొన్న జడ్పీ ఛైర్మన్ ఓటర్లకు అభివాదం తెలిపారు. పోలీసులు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఓటు వినియోగించుకొన్నట్లు తెలుపుతున్న ఉద్యోగినులు

పుంగనూరులో అరాచకాలను అంతం చేద్దాం: బీసీవై


కట్టకిందపాళ్యంలో ప్రచారం చేస్తున్న సుశీల

పుంగనూరు రూరల్, మే 5: పుంగనూరు నియోజకవర్గంలో అరాచకాలను తరిమికొట్టడానికి, ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్‌కు ఇవ్వాలని ఆయన సతీమణి సుశీల కోరారు. ఆదివారం పుంగనూరు కట్టకింద పాళ్యంలో ఇంటింటా ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. చెరుకు రైతు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీవైపార్టీకి అవకాశం కల్పిస్తే పేద కుటుంబాలకు పాడిఆవు, మండల కేంద్రాల్లో పాలడైయిరీ, రైతులు పండించిన పంటలు గిట్టుబాటు ధరలు కల్పించడం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కొన్నేళ్లుగా పాలించిన పాలకులు నియోజకవర్గంలో ఎలాంటి పరిశ్రమలు స్థాపించలేదని, నిరుద్యోగులు బయట రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెళుతున్నారని తెలియజేశారు. బీసీవై పార్టీకి అవకాశం ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు జరుగుతుందని వివరించారు. ఆమెవెంట బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష లక్ష్యం దిశగా దూసుకెళుతున్న టీడీపీ


వడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న రాజ్‌కుమార్

కుప్పం, మే 5: చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ లక్ష్యం దిశగా టీడీపీ దూసుకుపోతోందని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం పురపాలక సంఘం 7వ వార్డు పరిధిలోని వడ్డిపల్లెలో ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికా రంలోకి వచ్చాక కుప్పం మున్సిపాలిటీ రూపురేఖలే మారిపోతాయన్నారు. ఈసారి జరగబోయే అభి వృద్ధి రాష్ట్రానికే తలమానికం కానుందని తెలియజేశారు. అందుకే ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు.

టీడీపీ హయాంలోనే వడ్డెరల అభివృద్ధి

టీడీపీలోకి వంద వైసీపీ కుటుంబాలు


వడ్డెర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, మే 5 : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వడ్డెర్లు అన్నిరకాలుగా అభివృద్ధి చెందారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కర్లగట్ట పంచాయతీ వెంకటా పురం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వడ్డెర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత క్వారీల్లో 15 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మేనిఫెస్టోలోనే పొందుపరిచారన్నారు. వారికి కావలసిన పనిముట్లను సబ్సిడీపై అందిస్తామన్నారు. వెంకటాపురం, సోమాపురం గ్రామాలకు చెందిన మల్లికార్జున, వెంకటేష్, వెంకటప్ప, సురేష్, పెద్దన్న గుడిపల్లె మండలం కంచి బందార్లపల్లె, గుడుకొత్తూరు గ్రామాలకు చెందిన రాయ చంద్రప్ప, మిద్దింటి వెంకటేష్, వెంకటస్వామితో పాటు మరో 100 వైసీపీ కుటుంబాలు బూత్ కన్వీనర్ మురుగయ్య, వడ్డెర జిల్లా టీడీపీ సాధికార కమిటీ కన్వీనర్ కోళ్ల వెంకటేష్, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ సర్పంచ్ క్రిష్ణయ్య, మాజీ ఎంపీటీసీ చంగప్ప, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పెద్దన్న సహకారంలో టీడీపీలో చేరారు. ● సోగడబల్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆలీ, అర్బ బాషా, రబ్బు, షామీర్ బాషా, హేమంత్, షారుక్‌బాషా, రాజేష్, చరణ్, రవిలతో పాటు మరో పది కుటుంబాలు పంచాయతీ పార్టీ అధ్యక్షుడు మంజునాథ్ సహకారంతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గం అధ్యక్షుడు పీఎస్ మునిరత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, రాళ్లబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, కర్లగట్ట పంచాయతీ పార్టీ అధ్యక్షుడు గిరిధర్, యూనిట్ ఇన్‌చార్జి రుద్రప్ప, మురుగేష్, రామస్వామి, శ్రీనివాసులు, వెంకటేష్, మంజునాథ్, సుధ, చంద్రప్ప పాల్గొన్నారు.

అమర్‌కు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విరాళం



పలమనేరు, మే5 : పలమనేరు మండలం సముద్రపల్లి గ్రామానికి చెందిన కె.సాంబశివనాయుడు కుమార్తె , సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.హర్షిత మాజీ మంత్రి అమరనాథరెడ్డికి రూ. 50వేలు విరాళంగా అందజేసింది. టీడీపీపై ఉన్న అభిమానంతో ఎన్నికల ఖర్చు కోసం ఈ మొత్తాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మాజీ ఛైర్మన్ పెమ్మసాని బాలాజి నాయుడు, సముద్రపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

బాబుతోనే పల్లె ప్రగతి సాధ్యం: టీడీపీ


రెడ్లపల్లెలో మహిళకు కరపత్రం అందిస్తున్న విజయరామిరెడ్డి, చలపతిస్వామి తదితరులు

శాంతిపురం, మే 5 : పల్లెలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్ అన్నారు. ఆదివారం శాంతిపురం, బోయనపల్లె, మఠం, కర్లగట్ట, శివరామపురం, రాళ్లబూదుగూరు, సోగడబల్ల, కడపల్లె, బండపల్లె పెద్దూరు గ్రామాలలో టీడీపీ నాయ కులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి మహిళకు సబ్సిడీపై రెండు పాడి ఆవులు ఇస్తామన్నారు. కార్గో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని వివరించారు. అలాగే రెడ్డి, కురబ, వడ్డెర, వన్నికుల క్షేత్రియ, దళిత తదితర టీడీపీ అనుబంధ కుల నాయకులు మండలంలో ముమ్మర ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.జయరామిరెడ్డి, బాలు, భాస్కర్, ఆంజనేయరెడ్డి, పెద్దన్న, రుద్రప్ప, ప్రకాష్, గోపాల్, నారాయణ స్వామి, ఆర్‌ఎస్ మణి, మునిరెడ్డి, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, నాగభూషణంరెడ్డి, ఏఎంసీ నాగరాజు, క్యాబేజి మురళి, శ్యామల, రూప, అనుసూయ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు భద్రత


కందూరులో టీడీపీలో చేరిన వారితో చల్లా బాబు

సోమల, మే 5: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. ఆదివారం కందూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం కందూరులో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి ర్యాలీ నిర్వహించారు.

పుంగనూరు రూరల్: రాష్ట్రంలో మహిళల భద్రత తెలుగుదేశంపార్టీ పాలనలోనే సాధ్యమవుతుందని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జోగిండ్లులో ఇంటింటా ప్రచారం చేశారు. ● మండలంలోని వనమలదిన్నె, కుమ్మరగుంట గ్రామాలల్లో టీడీపీ నాయకులు మాధవ రెడ్డి, శమిపతి, చలపతి, గిరిబాబు, ప్రసాద్ తదితరులు సూపర్ సిక్స్ కరపత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు.

రొంపిచెర్ల: చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి చల్లా సుప్రియారెడ్డి చెంచెమరెడ్డిగారి పల్లె పంచాయతీలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ● అలాగే మండలంలోని పది పంచాయతీల నాయకులతో చల్లా బాబు స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారంపై సమీక్షించారు. వైసీపీ దౌర్జన్యాలను ఇంటింటికీ తీసుకెళ్లి వివరించాలని సూచించారు.

కల్లూరు: పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన కుమార్తె చల్లా పూజారెడ్డి కోరారు. పులిచెర్ల మండలం నన్నూరివారిపల్లి పంచాయతీలోని కుంటావారిపల్లి, కుమ్మరపల్లి, గొల్లపల్లి, నన్నూరివారిపల్లి, ఎగువ బెస్తపల్లిలో ఆమె ప్రచారం చేశారు.

బలిజలకు అండగా ఉంటా

బలిజ కులస్తులకు అన్ని విధాలా అండగా ఉంటానని చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళంపేట సమీపంలో ఆదివారం నిర్వహించిన బలిజ కులస్తుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ బలిజ కులస్తులు లోకేష్, భాస్కర్, మోహన్‌దాస్, పూల రమేష్, రామూర్తి, ప్రభాకర్, త్యాగరాజ, రమేష్, మహేష్, వెంకటేష్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మండలంలోని 29ఏ చింతమాకులపల్లె పంచాయతీలో చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

భవన నిర్మాణ కార్మికులకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదు

నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్


మాట్లాడుతున్న గాలి భానుప్రకాష్

విజయపురం/నగరి, మే 5: భవన నిర్మాణ కార్మికులకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నారపరాజుకండ్రిగ, మల్లారెడ్డికండ్రిగ, శ్రీహరిపురం, మహారాజపురం, కేశవపురం, కోసలనగరం, జంబాడ, పాతార్కాడు గ్రామాల్లో పర్యటించి టీడీపీని ఆదరించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రంలో రాక్షసపాలనను అంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు లక్ష్మీపతిరాజు, దశరథరాజు, రాఘవరాజు, సమరసింహారెడ్డి, ప్రకాష్, పురుషోత్తం, వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్‌రాజు, రవిరాజు, సుధాకర్‌రాజు, ధాము, హరికృష్ణ, సోమశేఖర్, నాగభూషణం యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నగరిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నగరికి చెందిన గోపాల్ మేస్త్రీ ఆధ్వర్యంలో సుమారు 300 మంది భవన నిర్మాణ కార్మికులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పారు. తడుకుపేటలో శివ, కిరణ్, దొరబాబు ఆధ్వర్యంలో 20మంది, బుగ్గఅగ్రహారంలో సుమారు 15 కుటుంబాలు టీడీపీలో చేరారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


పార్టీలో చేరిన వారితో జయప్రకాష్ నాయుడు

బంగారుపాళ్యం, మే 5: వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జరుగుతున్న దాడులు ఆగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. ఆదివారం మండలంలోని కురప్పల్లి, దండువారిపల్లె, జంబువారిపల్లె, ముంగరమడుగు, ఎర్రాండ్లపల్లి, కొదలమడుగు, శేషాపురం, వేపనపల్లి గ్రామాల్లో ఎన్‌పీ జయప్రకాష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేపనపల్లిలో పాలఏకరి కులానికి చెందిన 50 కుటుంబాలు, 15 ఎస్సీ కుటుంబాలు, శేషాపురం గ్రామానికి చెందిన పాలఏకరి కులానికి చెందిన 45 కుటుంబాలు, 15 ఎస్సీ కుటుంబాలు, కొదలమడుగులో 15 కుటుంబాలు ఎన్‌పీ జయప్రకాష్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఎన్‌పీ ధరణి, కోకా ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా దగ్గుమళ్ళ ప్రసాదరావు, మురళీమోహన్‌లను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, నాయకులు జయచంద్ర నాయుడు, ధరణీ నాయుడు, ఎన్‌పీ విక్రమ్, శ్రీనివాసులు, సుదర్శన్ నాయుడు, వంశీ, మురళీ నాయుడు, మోహన్ నాయుడు, త్యాగరాజులు నాయుడు, కుమార్, లోకనాథం నాయుడు, చిన్నయ్య,క్రిష్ణకుమారి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


వేపనపల్లిలో టీడీపీలో చేరిన గ్రామస్తులు

ప్రలోభాలకు తెరలేపిన వైసీపీ

చిత్తూరు, మే 5: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో పాల్గొనే చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగులను వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారు. చిత్తూరు నియోజకవర్గంలో ఉంటూ వివిధ ప్రభుత్వ శాఖల్లో మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటికే అధికార పార్టీపై ఉద్యోగులు గుర్రుగా ఉన్నారన్న విషయాన్ని తీసుకున్న అధికార పార్టీ నేతలు వారిని ప్రలోభాల్లో దించారు. ఈ వ్యవహారాన్ని విశ్రాంత ఉద్యోగ సంఘ నేతగా ఉన్న ఓ నాయకుడు ఈ వ్యవహారాన్ని నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఉద్యోగ సంఘ నేతగా చాలా ఏళ్లపాటు ఉండటానికి తోడు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఈయనకు ఆ బాధ్యతలను అప్పగించారు. దాంతో అయన ఉద్యోగులతో ఉన్న పరిచయంతో ఒక్కో ఓటు వైసీపీ నాయకులు రూ. 2వేల నుంచి రూ. 3వేల వరకు ఇచ్చినట్లు సమాచారం. అలాగే చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేసే ఇద్దరు కానిస్టేబుళ్లు, చిత్తూరు వన్ టౌన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ కలిసి వైసీపీ తరఫున పోలీసుల పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు.

టీడీపీతోనే రైతుల అభివృద్ధి


సూపర్ సిక్స్ గురించి ఓటర్లకు వివరిస్తున్న చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, మే5: టీడీపీతోనే రైతుల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్ అన్నారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని అనగళ్లు, పచ్చనపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎన్నికల మ్యానిఫెస్టో సూపర్ హిట్ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రాజా, రాజేష్, మురళి, వరదరాజులు నాయుడు, రవి, దినకర్, చల్లా, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

నింద్ర, మే 5: భావితరాల భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించాలని టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి నిరోషా కోరారు. ఆదివారం అగరం పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరి నియోజకవర్గం అభ్యర్థి గాలి భాను ప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావును గెలిపించాలని కరపత్రాలను అభ్యర్థించారు. కార్యక్రమంలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూతలపట్టులో సౌకర్యాలు లేక అవస్థలు


ఓటు వేసేందుకు నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు, మే 5: వైసీపీ నేతల కవ్వింపు చర్యలతో పోలింగ్ కేంద్రం సమీపాన కొంతసేపు వైసీపీ-టీడీపీ నాయకుల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలింగ్ కేంద్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు రిటర్నింగ్ అధికారులు కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడంతో చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఉద్యోగులు తమ ఓటుహక్కు వినియోగించుకోవడానికి గంటల తరబడి క్యూలైన్‌లో నిలవాల్సిన దుస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలో మొత్తం 1720 ఓట్లు ఉండగా, శనివారం 1302 ఓట్లు పోలయ్యాయి. ఇందులో భాగంగా బంగారుపాళ్యం 321, తవణంపల్లె 247, ఐరాల 237, పూతలపట్టు 311, యాదమరి 186 ఓట్లు పోలయ్యాయి. ఇదిలా ఉండగా, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్ళి ఉద్యోగస్థులతో మాట్లాడుతూ సౌకర్యాలు ఎలా ఉన్నాయని వారిని అడుగగా, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు తాగునీటి సౌకర్యం లేదని, కనీసం కూర్చోడానికి, భోజనం చేయడానికి షామియానాలు కూడా వేయలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన అధికారులు క్యూలైన్ వద్దకే తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కాగా పోలింగ్ కేంద్రంలో ఫ్యాన్లు లేకపోవడంతో అధికారులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పోలింగ్ కేంద్రం పక్కనే వున్న జాతీయ రహదారిపై వైసీపీ నేతలు తమ వాహనాలను ఆపి, కొంతమందికి డబ్బులు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తించిన టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడికి వెళ్ళేలోపు వారు వెళ్ళిపోయారు. అనంతరం పూతలపట్టు, ఐరాల మండలాలకు చెందిన కొంత మంది వైసీపీ నేతలు టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుతో మమ్మల్ని ప్రశ్నిస్తారా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం సీఐ సుదర్శన్ ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని అందరినీ చెదరగొట్టారు. అనంతరం పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో ఓటు వేసేందుకు వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

పుష్పపల్లకి సేవకు కొటేషన్ల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, మే 5: ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు గిరింపేట దుర్గాంబకు నిర్వహించే పుష్పపల్లకి సేవకు అవసరమయ్యే పనులకు కాంట్రాక్టర్ల నుంచి కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో మునిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు ఇతర వివరాల కోసం కార్యాలయ పనివేళలలో సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

28 మద్యం బాటిల్స్ పట్టివేత

కార్వేటినగరం,మే5: తమిళనాడు నుంచి కార్వేటినగరం మండలం కనికాపురం రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనం ద్వారా తరలిస్తున్న 28 మద్యం బాటిల్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుడి సేవలో కలెక్టర్, ఎస్పీ



ఐరాల(కాణిపాకం), మే 5: కాణిపాక వరసిద్ధుడిని కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠచందోలు ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారిని వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ సూపరింటెండంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరుల ఇళ్ళపై వైసీపీ అల్లరి మూకలదాడి

చిత్తూరు సిటీ, మే 5: నగరంలో వైసీపీ అల్లరి మూకల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆదివారం నగరంలోని బీవీ రెడ్డి కాలనీ సమీపంలోని కొంతమంది టీడీపీ నేతల నివాసాలు, సానుభూతిపరుల ఇళ్ళ వద్దకు వైసీపీ అల్లరిమూకలు వచ్చి బెదిరించారు. 'తక్షణం ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని లేదంటే ఏం చేయాలో మాకు తెలుసని' బెదిరించారు. అలాగే టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ బంధువుల ఇళ్ళ వద్దకు వెళ్లి గొడవలు చేశారు. గురజాల మాట్లాడుతూ కొంతమంది పోలీసులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డీజీపీ బదిలీ వేటుపై టీడీపీ నేతల హర్షం

గుడిపాల, మే 5: ఏకపక్షంగా వ్యవహరిస్తూ పోలీసులను, ఇటు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్న రాష్ట్ర డీజీపీపై ఎన్నికల సంఘం బదిలీవేటు వేయడంతో టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ డీజీపీ హయాంలో అమాయకులపై అక్రమ కేసులు పెటి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రతాప్ నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ధనంజయనాయుడు పాల్గొన్నారు.

రామానుజం చలపతి సస్పెన్షన్ ఎత్తివేత

నగరి మే5: నగరి పట్టణం ఒకటవ వార్డుకు చెందిన రామానుజం చలపతి సస్పెన్షన్ ను టీడీపీ జాతీయ నాయకుడు చంద్రబాబు సూచనల మేరకు నగరి టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు ఎత్తివేశారని నగరి టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలపతి సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు రమేష్‌బాబు, శివకుమార్ రెడ్డి, నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్, సురేష్‌నాయుడు, సురేష్‌నాయుడు, నారాయణ స్వామినాయుడు, దేవా పాల్గొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటేద్దాం చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దాం అంటూ నగరి, గుండ్రాజుకుప్పం ఆదిఆంధ్రవాడ యువత సామాల్మ గుడి వద్ద చలపతి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చంద్రబాబు, లోకేష్‌ల ఫొటోలను చేతబట్టిన యువకులు రానున్న ఎన్నికలలో టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం ప్రారంభించారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు



ఓటింగ్ ఎన్‌రోల్ చేసుకుంటున్న ఉద్యోగుల సందేహాలను నివృత్తిచేస్తున్న జేసీ శ్రీనివాసులు, గంగాధరనెల్లూరులో క్యూలో వేచివున్న టీచర్లు

చిత్తూరు, మే 5: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంటూ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వం వీరికి ఆదివారం నుంచి ఈ నెల 8వ తేది వరకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. చిత్తూరు జిల్లా వాసులై ఉండి నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో పెసిలిటేషన్ సెంటర్‌ను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలి రోజైనా ఆదివారం ఉదయం 9.30గంటల నుంచిసాయంత్రం 6 గంటల వరకు పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్లు, పోలీసు, ఆర్టీసీ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆదివారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 3304 ఓట్లు ఉండగా .1931 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 58 శాతం పోలింగ్ జరిగింది. కాగా జిల్లాయేతర ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన పెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చిత్తూరు పార్లమెంటు నియోజవకర్గ ఆర్వో, కలెక్టర్ షన్మోహన్ పోలింగ్ సరళిని పరిశీలించి హెల్ప్‌డెస్క్ అధికారులకు సూచనలు ఇచ్చారు. రెండో చోట్ల పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

జీడీ నెల్లూరులో 1436 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

గంగాధరనెల్లూరు, మే 5: గంగాధరనెల్లూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ నగిలి షన్మోహన్ తనిఖీచేశారు. ఉద్యోగులు 1680 మంది ఉండగా వారిలో 1436 మంది ఆదివారం పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. ఈ కేంద్రం వద్ద గంగాధరనెల్లూరు సీఐ శంకర్ ఆధ్వ ర్యంలో పలువురు ఎస్‌ఐలు, పోలీస్‌సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

రోజా మాయమాటలను నమ్మొద్దు

శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డివారి చక్రపాణిరెడ్డి

విజయపురం, మే 5: మంత్రి రోజా మాయమాటలు నమ్మి మోసపోకండని శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జంబాడ సమీపంలోని సెహ్రా నగర్‌లో లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింద్రలో నేను, వడమాలపేటలో మురళీధర్‌రెడ్డి, పుత్తూరులో అమ్ములు, విజయపురంలో లక్ష్మీపతిరాజు, నగరిలో కేజే కుమార్ సొంత డబ్బులు వెచ్చించి పార్టీని బలోపేతం చేశామని, మంత్రి రోజా అక్రమ వ్యాపారాలకు అడ్డుపడుతామని భావించి పార్టీ నుంచి దూరం చేసుకుంటూ వచ్చారని, అందువలనే పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. అనంతరం నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ మనందరమూ సమష్టి కృషి చేసి టీడీపీని ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తామన్నారు. అనంతరం పలువురు వైసీపీ నుండి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త మెరుపుల మహేష్, స్వామినాథన్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రవిశేఖర్‌రాజు, మణిరాజు, జయమూర్తి నాయుడు, అరుణాచలం రెడ్డి, గుణమ్మ, జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు అంతిమ ఘడియలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్, ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పూతలపట్టు, మే5: రాష్ట్రంలోని వైసీపీ అనే రాక్షసపాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయని పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఆయన పూతలపట్టులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా అధికారంలో ఉండి ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని, అటువంటి వారికి ఓటు అడిగే అర్హత లేదన్నారు. పూతలపట్టు మండలం టీడీపీ హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండలంలో సిమెంటు రోడ్లు, తారు రోడ్లు, వీధి దీపాలు కల్పించిన ఘనత తమ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యువరాజు నాయుడు, నాయకులు గుంటూరు మురళి, ప్రతాపనేని చంద్రమౌళి, ప్రతాపనేని ఇందిర, చిరంజీవి నాయుడు, హిమకర్ నాయుడుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్



నేతలతో కలిసి వస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, నరసింహాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న భీమనేని చిట్టిబాబు

గంగాధరనెల్లూరు, మే 5: ఈనెల 13న జరిగే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని... అదేస్థాయిలో టీడీపీని ఆదరించాలని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం గంగాధరనెల్లూరు మండలంలోని పాచిగుంటకు విచ్చేసిన థామస్‌కు టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పొదిలి రఘునాథనాయుడు, చెన్నైకి చెందిన శిల్ప ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, దేవపత్ని ధనంజయనాయుడు, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, స్వామిదాస్, మురళినాయుడు, జ్యోతియాదవ్, దేవపత్ని కిరణ్‌నాయుడు, మోహన్, రామాంజులు, తులసిరెడ్డి, వెంకటేష్ నాయుడు, బీజేపీ నేతలు మణివర్మ, రాజేంద్రన్, ఇడగట్టి సుధాకర్, మురళి, జనసేన నేత సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నరసింహాపురంలో భీమనేని ప్రచారం

పాలసముద్రం : ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను గెలిపించాలని పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు కోరారు. ఆదివారం మండలంలోని నరసింహాపురం పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, ధాము, మాజీ ఎంపీపీ మీనా మోహన్, రమేష్, అరుళ్‌నాథన్, తంగరాజ్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : కూటమి మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలతో ఏపీలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. ఆదివారం వెదురుకుప్పం మండలం మారేపల్లిలో కూటమి నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీకి చెందిన మారేపల్లి సర్పంచ్ అన్నురాశిఅశోక్‌కి శాలువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే ఉపసర్పంచ్ దేవి, వార్డు మెంబర్లు ఎన్.రాజేష్, నీలమ్మ, నందిని, భాను, తులసమ్మ, వరాలు, కస్తూరి, కుమారి తదితరులు పార్టీలో చేరారు. నాయకులు గురుసాల కిషన్‌చంద్, బట్టే చాణిక్యప్రతాప్, గాలి బాబునాయుడు, పోటుగారి గంగయ్య, శివరామయాదవ్, కావలి భాస్కర్, కావలి చక్రీ, పి.మోహన్‌మురళీ, మునిరాజా రెడ్డి, బండి విష్ణువర్ధన్‌రెడ్డి, సేతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా

గురజాల జగన్మోహన్


గురజాల జగన్మోహన్, సీకే బాబు స్వాగతం పలుకుతున్న స్థానికులు

చిత్తూరు సిటీ, మే 5: గాండ్ల కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గాండ్ల కులస్తుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నేత సురేష్ కోరారు. స్పందించిన గురజాల గాండ్లకులస్తులకు టీడీపీ అధినేత పెద్దపీట వేశారని, గాండ్ల కులానికి చెందిన గౌనివారి శ్రీనివాసులును ఎమ్మెల్సీగా చేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ప్రసాదరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు గాండ్ల సంఘం నేతలు పయణి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

16 వ డివిజన్ పరిధిలో : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన 16 వ డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలని, అయ్యప్పగుడి ప్రాంతాల్లో టీడీపీ తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో, 25, 29, 38వ డివిజన్ల పరిధిలోని మిట్టూరు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోసి నగర్, కాలనీ వాసులు తమకు మౌళికవసతులు లేవని ఎటువంటి సౌకర్యాలు లేవని తమ సమస్యలను గురజాలకు వివరించారు. స్పందించిన గురజాల తాము అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా దగ్గుమళ్ళ ప్రసాదరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మిట్టూరులో టీడీపీ బూత్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. మిట్టూరులో సుమారు 35 కుటుంబాలు సీకే బాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, మాజీ మేయర్ కటారి హేమలత, కాజూరు బాలాజి మాజీ కార్పొరేటర్లు వసంత్ కుమార్, సీకే సాయికృష్ణా రెడ్డి, వనిత శ్రీనివాసన్, సుధాకర్ రెడ్డి, రాజారెడ్డి, ప్రసాద్, తేజ, క్లస్టర్ ఇన్చార్జ్ వెంకటేష్ యాదవ్, నేతలు చిట్టిబాబు, పిళ్ళయ్, మాజీ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను గురజాల జగన్మోహన్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులకు, ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఉద్యోగులు సంయమనం పాటించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, జనరంజకమైన పాలనను అందించే టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.